ప్రజాశక్తి
మంగళవారం 7 మార్చి 2023
5
శ్రీ సత్యసాయి

టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న నిరసనకు దిగుతున్న వారిని అరెస్టు చేస్తున్న పోలీసులు

అనంతలో హై టెన్షన్

- రాళ్లు రువ్వుకున్న టిడిపి, వైసిపి వర్గీయులు
- గుంటూరు నుంచి అనంతకు చేరిన సోషల్ మీడియా వార్
- ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు అరెస్ట్

నిరసన తెలుపుతున్న వారిని అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ వ్యక్తిగత విమర్శలతో వైసిపి, టిడిపి నేతల పరస్పర దాడులతో అనంతపురం జిల్లా కేంద్రం హై టెన్షన్‌గా మారింది. సోషల్ మీడియా వేదికగా మొదలైన ఘర్షణ ఒకరిపై ఒకరు రాళ్లురువ్వుకుంటూ భౌతిక దాడులు చేసుకునేంత వరకు వెళ్లింది. సోమవారం ఉదయం టవర్‌క్లాక్ వద్ద చోటు చేసుకున్న ఈ దాడుల ఘటనతో ఒక్కసారిగా ఆ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. ఈ దాడుల్లో ఓ కానిస్టేబుల్, టిడిపి కార్యకర్తకు గాయాలు అయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మాజీ మంత్రి పరిటాల రవీంద్ర, ఆయన తనయుడు, టిడిపి యువ నాయకుడు పరిటాల శ్రీరామ్‌ను విమర్శిస్తూ గుంటూరుకు చెందిన వైసిపి సోషల్ మీడియా కార్యకర్త హరికృష్ణారెడ్డి రెండు రోజుల క్రితం ఓ పోస్టును ఫేస్‌బుక్‌లో పెట్టారు. దీనికి ప్రతిగా టిడిపి కార్యకర్తలు సైతం హరికృష్ణారెడ్డిని విమర్శిస్తూ పోస్టులు పెట్టారు. పరిటాల కుటుంబం అవినీతి, హత్యా రాజకీయాలను రాప్తాడు, అనంతపురంలోనే వివరిస్తానంటూ హరికృష్ణారెడ్డి మరో పోస్టు పెట్టారు. సోమవారం ఉదయం తాను అనంతపురం వస్తానని కూడా ఆ వీడియో సందేశంలో అతను తెలిపారు. ఈ మేరకు అతను సోమవారం ఉదయం రాప్తాడు నియోజకవర్గం కేంద్రానికి వెళ్లి తాను టిడిపి కార్యాలయం వద్ద ఉన్నానని తనతో మాట్లాడే వారు ఎవరైనా ఉంటే రావొచ్చని సోషల్ మీడియా ద్వారా సవాల్ విసిరారు. అనంతరం అక్కడి నుంచి వైసిపి మద్దతు దారులతో కలిసి అనంతపురం టవర్‌క్లాక్ వద్దకు వెళ్లాడు. హరికృష్ణారెడ్డి టవర్‌క్లాక్ వద్దకు వెళ్తున్నాడని తెలుసుకున్న టిడిపి మద్దతుదారులు, పరిటాల అభిమానులు అక్కడికి చేరుకున్నారు. టిడిపి, వైసిపి నాయకులు ఎదురెదురుపడడంతో ఒకరిపై ఒకరు రాళ్లు విసురుకున్నారు. ఈ ఘటనలో ఓ కానిస్టేబుల్, టిడిపి కాకర్యకర్తకు రాళ్లు తగిలి తలకు బలమైన గాయాలు అయ్యాయి. అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. గుంటూరు నుంచి వచ్చిన హరికృష్ణారెడ్డిని బలవంతంగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇతనితో పాటు టిడిపి మద్దతుదారులనూ అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. పోలీసుల తీరుపై టిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనవసరంగా కవ్వింపు చర్యలకు పాల్పడిన వైసిపి నాయకులను వదలి అక్రమంగా టిడిపి నేతలను అరెస్టు చేసి, బెదిరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి ఉద్రిక్తలకు కారణమైన వారిపై కేసులు నమోదు చేసి విచారణ చేస్తామని డీఎస్పీ ప్రసాద్ రెడ్డి తెలిపారు.

వలసెళ్లుతున్న ఊళ్లు..!

పనుల కోసం బెంగుళూరుకు వెళ్లేందుకు బళ్లారి రైల్వే స్టేషన్‌లో ఉన్న కూలీలు

రోజూ పని చేస్తే తప్పా పూటగడవని కూలీలు పనులు లేక వలసబాట పడుతున్నారు. ఉన్న గ్రామంలో కనీసం రోజుకు రూ.200 కూలి వచ్చే పనులు లేక కుటుంబ పోషణ నిమిత్తం నిత్యం వందలాది మంది కూలీలు నగరాలకు పయనం అవుతున్నారు. ఆసరాగా ఉండాల్సిన ఉపాధి హామీ ప్రభుత్వాల నిర్లక్ష్యంతో నీరుగారుతోంది. ఉపాధి పనిదినాలు పూర్తి స్థాయిలో ఉంటే వలసెళ్లాల్సిన పని లేదంటూ కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని తరచూ అధికారుల సమీక్షల్లో విన్పించే మాటలు ఆచరణలో కన్పించడం లేదు.

- ‘ఉపాధి’ లేక అవస్థలు
- పనుల కోసం నగరాలకు పయనం
- కుటుంబ పోషణకు తప్పదంటున్న కూలీలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

బొమ్మనహాల్ మండలం కర్నాటక సరిహద్దున ఉంది. ఈ ప్రాంతంలో ఎక్కువ మంది వ్యవసాయ కూలీలు ఉన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వీరంతా వ్యవసాయంతో పాటు ఉపాధి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఖరీఫ్, రబీ సాగు ముగియడంతో వ్యవసాయ పనులు తగ్గాయి. ఇలాంటి సమయంలో ఉపాధి పనులు కల్పించాల్సి ఉండగా దాని ఊసే లేకుండా పోయింది. దీంతో బొమ్మనహాల్ మండలం నుంచి నిత్యం కూలీలు బెంగుళూరుకు వలస వెళ్తున్నారు. మండల పరిధిలోని ఉంతకల్, కొలగానల్లి, గోనేహాళ్, శ్రీధర్‌ఘట్ట, బొల్లనగుడ్డం, కొత్తూరు, కానాపురం తదితర గ్రామాలకు చెందిన కూలీలు కుటుంబ పోషణ నిమిత్తం పొట్టచేతబట్టుకుని బెంగుళూరుకు వలస వెళ్తున్నారు. బళ్లారి రైల్వే స్టేషన్ మీదుగా ఇలా ప్రతి రోజూ పదుల సంఖ్యలో కుటుంబాలు బెంగుళూరుకు వలస పోతున్నారు. బళ్లారి రైల్వే స్టేషన్‌లో చూస్తే మండలం, పరిసర మండలాల నుంచి వలసెళ్లే కూలీలు అనేక మంది కన్పిస్తారు. ఆయా గ్రామాల్లో గత రెండు నెలల నుంచి ఉపాధి పనులు నామమాత్రంగానే నిర్వహిస్తున్నారు. చేసిన పనులకు కూడా బిల్లులు చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఒక్కొక్కరికి రోజు కూలి రూ.250 పడాలని నిబంధన ఉన్నా, రూ.100కు మించి కూలి రాని పరిస్థితి ఉంది. ఈ తక్కువ మొత్తం కూడా ఎప్పుడు ఖాతాల్లో పడుతుందో తెలియదు. దీనికి తోడు గత నెల రోజులుగా పనులు కల్పించడంలోనూ నిర్లక్ష్యం కొనసాగుతోంది.

పని ప్రదేశంలో వసతులూ శూన్యం

ఉపాధి హామీ పనులు చేస్తున్న చోట అధికారులు మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. వేసవిలో తాగునీరు, నీడ ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఇలాంటివేవీ అమలు కావడం లేదు. కూలీలకు పనిముట్లు కూడా ఇవ్వడం లేదు. గడ్డపారలు, గంపలను కూలీలు బయట అద్దెకు తెచ్చుకుంటున్నారు. గడ్డపారలు ఒక్కసారి పదును పెట్టేందుకు రూ.100 తీసుకుంటున్నారు. ఉపాధిలో వస్తున్న కూలి ఈ పనిముట్ల మరమ్మతులు, బాడుగలకే పరిపోతున్నాయంటూ కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధిపై నమ్మకం లేక కూలీలు వలసెళ్తున్నారు.

స్థానికంగా ఉపాధి లేకనే...

ఖరీఫ్, రబీ సీజన్ ముగియడంతో స్థానికంగా ఉపాధి పనులు తగ్గాయి. ఇలాంటి సమయంలో ఉపాధి పనులు విరివిగా కల్పిస్తే ఉపయోగంగా ఉంటుంది. అలా ఉపాధి పనులను కల్పించడం లేదు. ఉపాధి పనులు చేసినా కూలి గిట్టుబాటు కావడం కాలేదు. రోజుకు రూ.150కు మించి కూలి పడడం లేదు. దీంతో చేసేది లేక కుటుంబంతో సహా పనుల కోసం బెంగుళూరుకు వలస వెళ్తున్నాం.

హరిజన సుంకన్న,
గోనేహాల్ గ్రామం.

కుటుంబ పోషణ నిమిత్తం...

రోజు పనులు చేసుకుంటేనే జీవనం గడుస్తాది. ప్రస్తుతం గ్రామంలో పనులు లేవు. ఉపాధి పనులూ అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. దీంతో కుటుంబ పోషణ భారం అయ్యింది. చేసేది లేక బెంగుళూరుకు వెళ్తున్నాం. సొంత గ్రామంలో పనులు కల్పిస్తే ఈపరిస్థితి ఉండదు. అధికారులు స్పందించి విరివిగా ఉపాధి పనులు కల్పించి, గిట్టుబాటు కూలిని ఇవ్వాలి.

హనుమంతు
ఉంతకల్లు, గ్రామం.

నీటి సమస్య పరిష్కరించాలని ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

ఇస్లాపురంలో తాగునీటి సమస్య

నీటి సమస్య పరిష్కరించాలని ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన

ప్రజాశక్తి-పెనుకొండ

నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురం గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆ వార్డు కౌన్సిలర్ గీతా హనుమంతు ఆధ్వర్యంలో స్థానిక మహిళలు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇస్లాపురం గ్రామంలో నెలరోజుల నుంచి తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఈ విషయాన్ని స్థానిక నగర పంచాయతీ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని వాపోయారు. ఫలితంగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. చేసేది లేక సమీపంలోని పొలాల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని వాపోయారు. కావున ఇప్పటికైనా స్పందించి శాశ్వతంగా నీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కె.కార్తీక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీరామ్‌యాదవ్, 3వ వార్డు కౌన్సిలర్ ఎస్ఎస్ గిరి, ఇస్లాపురం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

హనుమంతు వాహనంపై కోనేటి రాయుడు

తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చిన ఖాద్రీసుడు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వరోజు సోమవారం హనుమంతు వాహనంపై శ్రీవారు సతీసమేతంగా భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఇందులో భాగంగా ఉదయం యాగశాల మండపం నుంచి బయలుదేరిన కాటమరాయునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి, శ్రీదేవి, భూదేవికి వస్త్ర సమర్పణలు చేసి పుష్ప అలంకరణ చేశారు. అనంతరం స్వామివారిని హనుమంతు వాహనంపై కొలువుదీర్చి మంగళ వాయిద్యాల మధ్య స్వామివారిని అంగరంగ వైభవంగా తిరువీధుల్లో విహరించారు. హనుమంతు వాహనంపై ఊరేగిన స్వామి ఉత్సవానికి ఉభయదారులుగా జొన్నా వీరయ్య, శేషయ్య వ్యవహరించారు. పలు కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఇఒ గురు ప్రసాద్, పాలకమండలి ఛైర్మన్ జరిపిటి గోపాలకృష్ణ భక్తులకు సౌకర్యాలు కల్పించారు. ప్రముఖులు, రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, ఇతర రాష్ట్రాల నుంచి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు బ్రహ్మ గరుడ సేవ

ఉత్సవాల్లో భాగంగా మంగళవారం లక్ష్మీనరసింహస్వామి గరుడ వాహనంపై విహరించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు నరసింహారావు, ఆలయ ఇఒ గురుప్రసాద్, పాలకమండలి ఛైర్మన్ గోపాలకృష్ణులు తెలిపారు. స్వయాన బ్రహ్మే దిగివచ్చి కదిరి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం నుంచి బ్రహ్మోత్సవం వరకు చేపట్టే విధంగా ఉత్సవాలు ఉంటాయని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో ఉభయదారులుగా నారాయణ శెట్టి, భార్య రెడ్డమ్మ కుటుంబ సభ్యులు, బేరి వర్తకులు కుటాగుల వారు వ్యవహరించనున్నట్లు తెలిపారు.

పారిశుద్ధ్యం మెరుగుపై ప్రత్యేక శ్రద్ధ : కమిషనర్

కాలువల్లో పూడికతీస్తున్న మున్సిపల్ సిబ్బంది

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా పారిశుధ్యం మెరుగు పరచడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈమేరకు సోమవారం ప్రత్యేక జెసిబిలను ఏర్పాటు చేసి వర్షాకాలంలో పూడిపోయిన ప్రధాన కాలువల్లో పూడికతీత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గతంలో కురిసిన వర్షాలకు పెద్ద కాలువల్లో వర్షం నీరు పారడంతోపాటు చెత్తచెదారం కొట్టుకురావడంతో ఎక్కడికక్కడ నీళ్ల నిలబడి పోతున్నాయన్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతూ దోమలు విపరీతంగా వృద్ధి చెంది విషజ్వారాల భారిన పడుతున్నారు. అలాగే ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను పురపాలక సంఘం వారు తీసుకొచ్చే చెత్త వాహనాల్లో అందించాలన్నారు. పారిశుధ్య మెరుగు పర్చుడానికి పురపాలక సంఘం వారు తీసుకునే చర్యలకు ప్రజలు పూర్తిగా సహకరిస్తే మెరుగైన ఫలితాలు సాధించడానికి అవకాశాలు ఉన్నాయన్నారు.

రైతులకు రుణాలు ఇవ్వండి

కలెక్టర్ బసంత్ కుమార్

బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రైతులకు విరివిగా రుణాలు అందించి పంట సాగుకు ప్రోత్సహించేలా బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ బసంత్ కుమార్ ఆదేశించారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. కలెక్టర్ అధ్యక్షతన 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణప్రణాళిక, బ్యాంకులు సాధించిన ప్రగతి తదితర అంశాలపై సమీక్షించారు. ఈ కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు రుణాల మంజూరు, పంపిణీని బ్యాంకర్లు వేగవంతంగా చేపట్టాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు రుణాల మంజూరులో బ్యాంకర్లు వెంటనే పురోగతి సాధించేలా ప్రత్యేక దష్టి సారించాలన్నారు. రైతులకు పంట రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా కౌలు రైతులకు, స్టాండప్ ఇండియా, పీఎం ముద్ర యోజన కింద రుణాలు, వీవర్స్‌కు, పశుసంవర్ధక, మత్స్య రైతులకు రుణాలు అందించడంలో మరింత పురోగతి చూపించాలన్నారు. వివిధ పథకాల కింద డీఆర్డీఏ, మెప్మా పరిధిలో చిరు వ్యాపారులకు అందించే రుణాల లక్ష్యం చేరుకోలేదని, వెంటనే అర్హత కలిగిన లబ్ధిదారులకు రుణాలను మంజూరు చేసి పంపిణీ చేసేలా చూడాలన్నారు. వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని గుర్తు చేశారు, అవుత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ముందుకు రావాలన్నారు, టిడ్కోగహాలు, ఇతర గహ నిర్మాణ పథకాల లబ్ధిదారులకు బ్యాంకులు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. ప్రధానమంత్రి ముద్ర యోజన, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళ, రంగాలకుసంబంధించి రుణాల మంజూరు చాలా పెండింగ్ ఉందని, వెంటనే కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. రుణాల మంజూరులో ఏమైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించుకునేలా కషి చేయాలని తెలిపారు. కేటాయించిన లక్ష్యాలను మార్చి 31వ తేదీ నాటికి పూర్తిగా వంద శాతం చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఐసిసిఐ జిల్లా కోఆర్డినేటర్ సభ్యులు కెవి.రమణ, ఆర్‌బిఐ ఏజీఎం అనిల్ కుమార్, రవిచంద్ర రెడ్డి, ఎల్‌డిఎం సాయినాథ్ రెడ్డి, కెనరా బ్యాంకు ఏజీఎం రాంప్రసాద్ రెడ్డి, ఎస్‌బిఐ ధర్మవరం ఆర్ఎం సంజీత్ కుమార్, యుబిఐ బ్యాంక్ ఎజిఎం అశ్వర్థ నాయక్, వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, ఆఆర్డీఎ పీడీ నర్సయ్య, సెరికల్చర్ జేడీ పదమ్మ తదితరులు పాల్గొన్నారు.

‘మిస్టర్ ఇండియా’ 2వ స్థానంలో హిందూపురం వాసి

జాతీయ స్థాయిలో రెండవ స్థానం సాధించిన ఆసీఫుల్లా

హిందూపురం : దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన మిస్టర్ ఇండియా పోటీల్లో హిందూపురానికి చెందిన ఆసీఫుల్లా రెండవ స్థానం సాధించాడు. ఆసీఫుల్లా పట్టణంలో గోల్డెన్ జిమ్‌ను నిర్వహిస్తున్నాడు. గతేడాది రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. దీంతో ఆదివారం ఢిల్లీలో జరిగిన మిస్టర్ ఇండియా పోటీల్లో పోటీల్లో ఆయన రెండవ స్థానంలో నిలిచి హిందూపురం పేరును జాతీయస్థాయిలో చాటిచెప్పారు. ఈ సందర్భంగా ఆసీఫుల్లా మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల కఠోర శ్రమతో తనకు ఈ స్థానం దక్కిందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలు సాధించి హిందూపురానికి మంచి పేరును తీసుకొస్తానన్నారు.

మహిళలు నైపుణ్యత పెంచుకోవాలి

నాబార్డ్ డిడిఎం అనురాధ

కార్యక్రమంలో మాట్లాడుతున్న నాబార్డ్ డీడీఎం అనురాధ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మహిళలు ఏదో ఒకవృత్తిలో నైపుణ్యం పెంపొందించుకుని రాణించాలని నాబార్డ్ డిడిఎం అనురాధ పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రశాంతి గ్రామ్‌లో 15 రోజులుగా జీవస్త్రం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలు 30మందికి శారీ రోలింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నాబార్డ్ గ్రామీణ ప్రాంతాల మహిళలకు నైపుణ్యం పెంచి తద్వారా ఉపాధి పెంపొందించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఇందులో భాగంగానే శారీ రోలింగ్, పట్టు చీరల డ్రై క్లీనింగ్‌పై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణ పొందిన మహిళలు సొంతంగా షాపులు నిర్వహించుకోవచ్చన్నారు. అందుకు నాబార్డ్ తగిన సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. అనంతరం మహిళా దినోత్సవ శుభాకాంక్షలు అందజేస్తూ శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీవస్త్రం సంస్థ అధ్యక్షురాలు రమీజా, నాబార్డ్ అధికారులు మంజునాథ్ మెప్మా జిల్లా అధ్యక్షురాలు సాయి లీల, రమాదేవి, ధరణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

వామపక్ష, ప్రజాసంఘాల ప్రచారం

కనగానపల్లిలో ప్రచారం చేస్తున్న రైతు, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-నల్లచెరువు

పిడిఎఫ్ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిక మద్దతుగా రైతుసంఘం, సిఐటియు నాయకులు సోమవారం మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లోని ఉపాధ్యాయులు, పట్టభద్రులను కలసి ఓటు వేయాలని అభ్యర్థించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావాలంటే తప్పనిసరిగా నిత్యం పోరాటం చేసే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి రామకృష్ణ, రైతుసంఘం నాయకులు శ్రీరాములు పాల్గొన్నారు.

కనగానపల్లి : పశ్చిమ రాయలసీమ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న పోతుల నాగరాజు, కత్తి నర్సింహారెడ్డిని గెలిపించాలని వామపక్ష నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, బ్యాంకులు, ఇతర ప్రాంతాల్లో వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు ఓటర్లను కలుసుకుని ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బత్తల కదిరప్ప, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నామాల నాగార్జున, రైతుసంఘం జిల్లా ఉప కార్యదర్శి బ్యాళ్ల మహదేవ, బాలరాజు, నారాయణస్వామి, ముత్యాలు, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటే బెల్ట్ టెస్ట్

ప్రజాశక్తి-కదిరిటౌన్

పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యునైటెడ్ షోటోఖాన్ కరాటే దో ఇండియా ఆధ్వర్యంలో సోమవారం కరాటే బెల్ట్ టెస్ట్ పరీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా స్టైల్ చీఫ్ కరాటే మాస్టర్ 5వ డాన్ బ్లాక్ బెల్ట్ మాస్టర్ షాకీర్ ఆధ్వర్యంలో వామప్స్, సిటప్స్, పంచెస్, బ్లాక్స్, కిక్స్, స్టాండ్స్, కటస్, బ్రీతింగ్స్, బొంకాయి వంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పోలీస్ అకాడమీ కరాటే కోచ్ వి.మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ కరాటే వల్ల విద్యార్థినీ, విద్యార్థుల్లో ఆత్మరక్షణ, ఆత్మ విశ్వాసం, ఆత్మ ధైర్యం, శారీరక దారుఢ్యం, మానసికోల్లాసం, మేధాశక్తిని పెంపొందించేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అంతేగాకుండా ఆపద వచ్చినప్పుడు మనల్ని మనం కాపాడుకోవచ్చన్నారు. అనంతరం బెల్ట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ పరీక్షల్లో 30 విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. వీరిలో మహమ్మద్ ఫహీం, కోమలి, గీతా, మహిజిత్ మారుతి, అలియా, అమిలా, జశ్వంతిక ఎల్లో బెల్ట్, శ్రీకృష్ణకీర్తి, రబ్బాన్, రిహాన్, తౌహీద్, దేవంత్ కుమార్, వంశీకృష్ణ ఆరంజ్ బెల్ట్, మహమ్మద్ కైఫ్, వైష్ణవి, హర్షవర్ధన్ గ్రీన్‌బెల్ట్, సాయి, రిషిత, వీక్షణ బ్లూ బెల్ట్, ద్రైవిక్, యాధిక్, నిహిత, నితిక్, భావన లక్ష్మి, లక్ష్మణకుమార్ పర్పుల్ బెల్ట్, సీనియర్ కలర్ బ్రౌన్ బెల్ట్‌లో రిదా ముస్కాన్, రోష్ని బ్రౌన్ 3, మహమ్మద్ జయిద్, త్రివేణి బ్రౌన్ 2, మనోజ్, సాయి బ్రౌన్ 1ని సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే కోచ్ చాందిని, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అలైహి వసల్లం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలీసు 'స్పందన'కు అర్జీల వెల్లువ

ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి ఫిర్యాదుదారుల తాకిడి రోజురోజుకీ పెరుగుతోంది. పలువురు బాధితులు నేరుగా ఎస్పీ వద్దకు వచ్చి తమ గోడు వెల్లబోసుకుని కన్నీరుమున్నీరు అవున్నారు. ఇందులో భాగంగానే సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పుట్టపర్తి చిత్రావతి రోడ్డులో కాపురం ఉంటున్న సాయి రమేష్ కప్పల బండ పొలం సర్వేనెంబర్ 308-2ఎ, 308-3బిలో 1996లో భూమిని కొనుగోలు చేసి, రెవెన్యూ అథారిటీ నుంచి ముటేషన్ చేయించి 1బి, పాసుపుస్తకం పొందడంతోపాటు సాగులో ఉన్నామని బాధితులు తెలిపారు. అయితే ఇదే గ్రామానికి చెందిన పలువురు భూమి తమదని దౌర్జన్యం చేస్తున్నారన్నారు. ఇదే విషయమై పలుమార్లు పుట్టపర్తి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. అంతేగాకుండా తనపైనే కేసు నమోదు చేయించారని కన్నీరు మున్నీరయ్యాడు. అదేవిధంగా రొద్దం మండలం బూచర్ల గ్రామానికి చెందిన శివప్ప సర్వే నెంబర్ 9-3లో 40 సెంట్లపై పూర్తి హక్కు ఉన్నా కొందరు దౌర్జన్యం చేయడంతోపాటు తమపైనే ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కేసు పెడతామని బెదిరిస్తున్నారని వాపోయాడు. తనకు, తన కుమారునికి ప్రాణహాని ఉందని, మమ్మల్ని రక్షించాలని ఎస్పీ ముందు విలపించారు. ఈ సందర్భంగా 41 ఫిర్యాదులు రాగా ఆయా పోలీసుస్టేషన్ పరిధిలోని అధికారులతో స్వయంగా ఎస్పీ ఫోన్ చేసి పరిష్కరించాలని ఆదేశించారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సోదరుడు వెంకటకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-బత్తలపల్లి

ముఖ్యమంత్రి జగన్ పాలనలో పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు వెంకటకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పోట్లమర్రి గ్రామంలో 'గుడ్ మార్నింగ్ ధర్మవరం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలకు సంబంధించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ మూడున్నరేళ్లలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ముఖ్యంగా మేనిఫెస్టోలో దాదాపు 90 శాతం హామీలు అమలు చేసిన ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు. అనంతరం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గజ్జెల వెంగళరెడ్డి, సర్పంచు దామోదర్, సచివాలయాల కన్వీనర్ జయరామిరెడ్డి, వైసిపి నాయకులు వెంకటరెడ్డి, రాజారెడ్డి, దినేష్, కుమార్‌రెడ్డి, రామకృష్ణ, శంకర్, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, కదిరి

O.S N.o. 122/2018.

Between.
(1) పసల శ్రీనివాసులు రెడ్డి
S/o గంగిరెడ్డి R/o కుటాగుల్ల, కదిరి. ...వాది.

మరియు

(1) జరిపిటి వెంకటరమణ S/o కిష్టప్ప.
(2) జరిపిటి మంజుల W/o వెంకటరమణ
R/o జొకల కొత్తపల్లి అమడగూరు (మండలం)
శ్రీసత్యసాయి జిల్లా. ...ప్రతివాదులు.

ప్రతివాదులుకు దావా సమన్లు

ఇందుములముగా ప్రతివాధులు అయిన మీకు తెలియజేయడం ఏమనగా వాది అయిన P.శ్రీనివాసులు రెడ్డి ప్రామిసరి బాకీ నిమిత్తం అయి మీ ఇరువురు పైన పై కోర్టు నందు దావా వేసివున్నారు . పై దావా వాయిదా 10-03-2023 తేదీన మీ హాజరు నిమిత్తం అయివున్నది. కావున ప్రతివాదులు అయిన మీరు, పై కోర్టు నందు ఉదయం 10.30 గంటలకు హాజరు కావలెను. అట్లు హాజరుకాని యెడల మీ పరోక్షమున కోర్టు వారు నిర్ణయము తీసుకుందురు.

కోర్ట్ వారి ఉత్తర్వులు మేరకు

వాయిదా తేది : 10-03-2023.

S. శివ శంకర రెడ్డి,
వాదితరపు వకీలు,
కదిరి.

జాతీయ సమైక్యతా శిబిరానికి విద్యార్థిని ఎంపిక

జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బలరామిరెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

జాతీయ సమైక్యతా శిబిరానికి పట్టణంలోని బాలయేసు కళాశాలలో డిగ్రీ చదువుతున్న విద్యార్థిని భార్గవిని ఎంపిక చేస్తూ శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త మురళీధరరావు ఉత్తర్వులు అందించినట్లు మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బలరామిరెడ్డి తెలిపారు. ఈమేరకు సోమవారం స్థానిక కళాశాలలో ఎంపికైన విద్యార్థిని భార్గవిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్య అథితిగా హాజరై మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బలరామిరెడ్డి మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 21 వతేదీ వరకూ బెంగళూరులో జరిగే జాతీయ సమైక్యతా శిబిరానికి విశ్వవిద్యాలయం తరుపున కళాశాల నుంచి ఎంపిక కావడం గమనార్హం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనాథరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు అశ్వర్థ నారాయణ, రఘు, రమేష్, హరీష్. తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది సంతోషికుమారి

ప్రజాశక్తి-హిందూపురం

సమాజంలోని ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని న్యాయవాదులు సూచించారు. ప్రపంచ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక కొట్నూరు నిర్మల వృద్ధాశ్రమంలో మహిళా న్యాయవాదుల ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విధిగా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత తమ పిల్లలపై ఉంటుందన్నారు. అలా ఎవరైనా తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తుంటే నేరుగా న్యాయస్థానంలో ఫిర్యాదు చేసి సత్వర న్యాయం పొందవచ్చన్నారు. అలాగే ఆర్థికంగా సమస్యలు ఎదుర్కొంటూ కోర్టులో కేసుల పరిష్కారం కోసం ఇబ్బందులు పడుతుంటే అలాంటి వారి కోసం ఉచిత న్యాయ సహాయం కూడా అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో న్యాయవాదులు సంతోషికుమారి, నవీరా, రహిమాన్, ఉదయ్ సింహారెడ్డి, రమేష్, యూసుఫ్, వృద్ధాశ్రమ నిర్వాహకులు అశ్వర్థప్ప, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రచ్చకెక్కిన ఇళ్ల పట్టాల సమస్య

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండల కేంద్రంలో పంపిణీ చేసిన ఇళ్ల పట్టాల సమస్య రచ్చకెక్కింది. ఒకవ్యక్తి మరో వ్యక్తికి చెందిన ప్లాట్‌ను ఆక్రమించుకున్నాడని సోమవారం మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఘర్షణకు దిగారు. వివరాల్లోకి వెళ్తే... కొత్త చెరువులోని ధర్మవరం రోడ్డులో ఉన్న 384 సర్వే నెంబర్‌లో రెండో విడత కింద 140 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు.య ఈ సర్వేనెంబర్‌లో వైసిపి టౌన్ కన్వీనర్ ముద్దల భాస్కర్ ఒక ప్లాట్ పట్టా తీసుకున్నాడు. దీనికితోడు మరో ప్లాటును ఆక్రమించుకుని ఇంటి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీంతో వైసిపి నాయకులు బేల్దారి యల్లప్ప, అశోక్ వ్యతిరేకిస్తూ తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అయినా లెక్కజేయకుండా ఇంటి నిర్మాణ పనులు కొనసాగించాడు. చేసేదిక ఆదివారం నిర్మాణ ఇంటి వద్దకు వెళ్లి అడ్డుకున్నారు. తిరిగి సోమవారం ఉదయం కూడా కూడా స్థానిక వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఇరువర్గాలు ఘర్షణకు పాల్పడ్డాయి. ఈ విషయం తెలుసుకున్న మండల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి ఘటనా స్థలానికి వచ్చి ఇరువర్గాలకు సర్ది చెప్పి పంపించడంతో వివిదాం సద్దుమనిగింది.

తండాలకు ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

హోలీకి రూ.7లక్షలు అందజేత

ప్రజాశక్తి-కదిరి అర్బన్

గిరిజనలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే హోలీ పండుగ కోసం ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి రూ.7 లక్షలు వితరణగా అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని 70 తండాలకు ఒక్కో తండాకు రూ.10వేలు చొప్పున బంజారా సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు కృష్ణానాయక్‌కి అందజేశారు. ప్రతి తండాలోని ప్రజాప్రతినిధులతో కలిసి బంజారాలకు అందించే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బంజారాలు అతి పవిత్రంగా జరుపుకునే హోలీ పండుగను ఎంతో ఆనందంగా జరుపుకుని సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

ప్రజాశక్తి-గాండ్లపెంట

హరీష్ స్కూల్ వ్యవస్థాపకులు శ్రీనివాస్ జయంతి పురస్కరించుకుని మండల పరిధిలోని మల్లమీద పంచాయతీలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సోమవారం లైబ్రరీ పుస్తకాలు వితరణగా అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు లింగాల రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల పాఠశాలలకు నిరుపేదల విద్యార్థులు చదువుల కోసం కదిరి మానసధార సేవా సంస్థ ద్వారా దాదాపు రూ.30 వేల విలువజేసే పుస్తకాలను అందజేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కదిరి రోటరీ క్లబ్ సెక్రటరీ, ఉపాధ్యాయుడు తాహర్ అలీ, పాఠశాల కాంప్లెక్స్ కోర్ కమిటీ ఛైర్మన్ సునీల్‌కుమార్, ఉపాధ్యాయులు హనుమంతురెడ్డి, హైదరవలి, శ్రీరాములు, చంద్రమోహన్, హరి, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీకి పుస్తకాలు వితరణగా అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలి

ప్రజాశక్తి-రొద్దం

విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని సానిపల్లి ఎంపియూపి పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాగా చదివి ఉన్నత స్థాయిలో అభివృద్ధి చెందాలన్నారు. ముఖ్యంగా చెడు మార్గంలోకి వెళ్లరాదన్నారు. ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ కరువు సీమలో చదువు అనే సంపదను సాధిస్తే అన్ని సంపదలు కలిసివస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పరమేష్, విద్యాకమిటీ ఛైర్మన్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పోతలయ్య, నారాయణస్వామి, కృష్ణానాయక్, జయమ్మ, సత్యమయ్య, మోహన్‌రెడ్డి, నరేష్‌కుమార్, వరలక్ష్మి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ప్రాముఖ్యతపై అవగాహన

కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ జగదీష్

ప్రజాశక్తి-రొద్దం

అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా డాక్టర్ జగదీష్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని ప్రతి సచివాలయంలో ప్రభుత్వ ఆరోగ్య సిబ్బంది మహిళల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీష్‌బాబు మాట్లాడుతూ అంతర్జాతీయ దినోత్సవం, మహిళల ప్రాముఖ్యత, ఆడపిల్లల నిష్పత్తి అవగాహనపై వివరించారు. ముఖ్యంగా 'ఆడపిల్లలు రక్షిస్తాం.. ఆడపిల్లలను చదివిస్తాం', 'లింగ నిర్ధారణ పరీక్ష చట్టరీత్యా నేరం' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనురాధ, ఆరోగ్య సిబ్బంది శ్రీనివాసులు, ఆయా సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరిఅర్బన్

పెట్టుబడులే లక్ష్యంగా విశాఖలో నిర్వహించిన అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సు విజయవంతం కావడం పట్ల సోమవారం స్థానిక వాల్మీకి పాఠశాలలో ఎమ్మెల్యే సిద్ధారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కోసం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకే విశాఖలో పెట్టుబడుల సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సదస్సులో పారిశ్రామిక వేత్తలు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. దాదాపు 340 ఎంఒయులతో రూ.13లక్షల కోట్ల పెట్టుబడులతో 6 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పూనుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇంతమంది పెట్టుబడిదారులు రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో విసిఎన్ఆర్ఐ విద్యాసంస్థల ఛైర్మన్ వెన్నపూస విశ్వనాథరెడ్డి, వైసిపి నాయకులు వాల్మీకి అనిల్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ జెసిఎస్ ఇన్‌ఛార్జిలు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కేక్ కోసి సంబరాలు చేసుకుంటున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి, నాయకులు

ఉర్దూ పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారం

వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సాహితీ గగన్‌మహల్ అధ్యక్షులు జె.ప్రతాప్‌రెడ్డి

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాలలో హెచ్ఎం మహమ్మద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ ప్లాంట్‌ను సాహితీ గగన్‌మహల్ అధ్యకులు, నాయ్యవాది జె.ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీంతో తాను బెంగళూరుకు చెందిన ప్రముఖ వాస్తు శిల్ప మల్లికార్జునశెట్టికి సమస్యను వివరించి ఇండస్ టిఎంటి ఇండస్ట్రీస్ లిమిటెడ్ బెంగళూరు ఎండి ఎస్ఎస్.శ్రీకాంత్‌తో మాట్లాడి 500 లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్ఓ ప్లాంట్‌ను నిర్మించినట్లు తెలిపారు. దీంతో పాఠశాలలో నీటి సమస్య పరిష్కారమైందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటో సీజ్

సీజ్ చేసిన ఆటో

ప్రజాశక్తి-హిందూపురం

రూరల్ మండలం కొటిపి సమీపంలో అక్రమంగా రేషన్‌బియ్యం తరలిస్తున్న ఆటోను సోమవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా అప్‌గ్రేడ్ సిఐ కృష్ణారెడ్డి మాట్లాడుతూ కొటిపి ప్రాంతం నుంచి కర్నాటక రాష్ట్రానికి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు పక్కా సమచారంతో కొటిపి చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనఖీ చేపట్టినట్లు తెలిపారు. ఈనేపథ్యంలో సోమందేపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణ లగేజి ఆటోలో రూరల్ మండలం కిరికెర పంచాయతీ ఐటిఐ కాలనీకి చెందిన డ్రైవర్ సోమేష్ 25 సంచుల్లో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

గొర్రెలు పంపిణీ

గొర్రెలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ముదిగుబ్బ : హోలీ పండుగను పురస్కరించుకుని సోమవారం మండల పరిధిలోని మలకవేముల క్రాస్‌లో ఉన్న సిరి వన్‌సిటీ కాలనీలోని స్వగృహంలో నియోజకవర్గ సామాజికవేత్త గడ్డం రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో తండావాసులకు గొర్రెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటిరెడ్డిపల్లి తండా, ఓడీ తండా, చెంచుగారిపల్లి తండా, వడదలపల్లి తండా, చెంచుగారిపల్లి తండాలకు గొర్రెల పంపిణీ చేసినట్లు తెలిపారు.

బావి పూడ్చివేత అడ్డగింత

కొత్తచెరువు : మండల పరిధిలోని ఇరగంపల్లి గ్రామంలో పురాతనం కాలం నుంచి ఉన్న చేతబావిని పూడ్చివేస్తుండటంతో విషయం తెలుసుకున్న జనసేన నాయకులు, గ్రామస్తులు అడ్డుకున్నారు. ఆదివారం రాత్రి వైసిపి నాయకులు, సర్పంచి నాగరత్న, భర్త ఎంపిటిసి సాంబశివారెడ్డి గ్రామంలోని రోడ్డు వేయడానికి బావిని పూడ్చడానికి శ్రీకారం చుట్టారు. విషయం తెలుసుకున్న స్థానికులు జనసేన నాయకుల సాయంతో అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కి పిలిపించుకుని చర్చించారు. అనంతరం యథావిధిగా బావిని పూడ్చివేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన

గాండ్లపెంట : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులకు ఎమ్మెల్సీ ఎన్నికలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రవి మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలా ఓటు వేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంపిపి తాతం జగన్మోహన్, వైసిపి మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ సి.కొండయ్య, సిపిఎం ఖాదర్‌బాషా, బిజెపి మండల అధ్యక్షుడు డి.ఆనంద్, సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

తలుపుల : మండల పరిధిలోని పెద్దన్నవారిపల్లికి చెందిన గంగయ్య కుమారుడు సాయికుమార్ ఉన్నత చదువుల కోసం వైసిపి సిఇసి సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి సోమవారం రూ.30వేలు ఆర్థికసాయం అందజేశారు. సాయికుమార్ ఉన్నత చదువులు చదివేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న పూల శ్రీనివాస్‌రెడ్డి ఆర్థికసాయం అందజేశారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

చిలమత్తూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమాచార హక్కు చట్టం -2005పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స.హ ఐక్యవేదిక జిల్లా ఇన్‌ఛార్జి మొరంపల్లి శివకుమార్‌యాదవ్, మండల అధ్యక్షుడు సోమశేఖర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అనేది ప్రజల చేతిలో వజ్రాయుధం అన్నారు. వామపక్ష పార్టీలు యూపిఎ ప్రభుత్వంలో ఓ మహోత్తర చట్టాన్ని చేశాయని గుర్తు చేశారు. ఈ చట్టంపై విద్యార్థులు అవగాహన పెంచుకుని అవినీతి రహిత సమాజాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అశ్వర్థరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా ఆధార్ అనుసంధానం : ఆర్‌డిఓ

పుట్టపర్తిరూరల్ : ఓటరు కార్డుకు ఆధార్ కార్డు అనుసంధానం వేగవంతంగా పూర్తి చేయాలని రెవెన్యూ డివిజినల్ అధికారి భాగ్యరేఖ ఆదేశించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై బూత్‌స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టభద్రులు, టీచర్ల ఓటర్ల స్లిప్పుల పంపిణీ వేగవంతం చేయాలన్నారు. అలాగే ప్రజలు కూడా ఓటరు కార్డుకు ఆధార్ లింకును స్వచ్ఛందంగా చేసుకోవాలన్నారు. అప్పుడే ఓటరు జాబితాలో మరణించిన, డబుల్ ఓటర్లను తొలగించేందుకు సులభం అవుతుందన్నారు. అదేవిధంగా 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకుల నివాసం పుట్టిన తేదీ వంటి వివరాలతో కూడిన ధృవ పత్రాలను వివరాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భాగ్యరేఖ, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, బూత్‌స్థాయి అధికారులు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

ధర్మవరం టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి, నీటి పన్నులతోపాటు ఖాళీస్థలాలకు సకాలంలో పన్నులు చెల్లించాలని, లేనిపోతే మున్సిపాలిటీ చట్టం-1965 ప్రకారం చట్టపరమైన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇప్పటి వరకు ఇంటి పన్ను రూ.6,01,26,106, నీటిపన్ను రూ.6,17,86, 695, ఖాళీ జాగా పన్నులు రూ.49,14,043 వసూలైనట్లు తెలిపారు. అంతేకాకుండా మున్సిపాలిటీలో అనధికారికంగా ఉన్న కొళాయి కనెక్షన్లకు సంబంధించిన డిపాజిట్‌లను మున్సిపల్ కార్యాలయంలో వెంటనే చెల్లించాలని కోరారు.

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున